సాక్షి
యాదాద్రి భువనగిరి

గురువారం ၊ 31 ၊ ఆగస్టు ၊ 2023



బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదు

వచ్చే ఎన్నికల్లో మంత్రి జగదీష్‌రెడ్డి బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని బీఎస్పీ నాయకులు హెచ్చరించారు. - 8లో



మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం

వంట గ్యాస్ ధర తగ్గించడంతో ఆ పార్టీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. - 9లో



మర్రి జనార్దన్‌రెడ్డిపై ఫిర్యాదు

అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. - 9లో

న్యూస్‌రీల్

మంత్రి జగదీష్‌రెడ్డి రాఖీ శుభాకాంక్షలు

సూర్యాపేట: రాఖీ పౌర్ణమి సందర్భంగా జిల్లా ప్రజలకు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సోదరభావానికి నిలువెత్తు నిదర్శనమే రాఖీ పౌర్ణమి అని పేర్కొన్నారు. ఏటా శ్రావణమాసంలో పౌర్ణమి నాడు మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టడం అనాదిగా వస్తున్న సంప్రదాయమన్నారు. భారతీయ సంస్కృతీలో ఇది గొప్ప ఆచారమని తెలిపారు. ప్రజల మధ్య సోదర భావం మరింత పరిఢవిల్లాలని ఆకాంక్షించారు.

ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం

భువనగిరి టౌన్ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇవ్వనున్న ప్రతి హామీని అధికారంలోకి రాగానే అమలు చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి తెలిపారు. భువనగిరిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిరుపేదలకు అన్ని విధాలా న్యాయం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు.

న్యాయవాదుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

చౌటుప్పల్ : రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాది సత్యనారాయణపై కొందరు దాడికి పాల్పడడాన్ని నిరసిస్తూ బుధవారం చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. దాడికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకిటి నర్సింహారెడ్డి, న్యాయవాదులు పాల పరమేష్, ముత్యాల సత్తిరెడ్డి, పిట్టల భిక్షమయ్య, తాడూరి పరమేష్ జె.శేఖర్, స్వాతి, రవీందర్, శ్రీశైలం, నర్సింహ, శ్రీకాంత్, శ్రీశైలం, జంగయ్య, రాఘవేంద్ర పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారి

బొమ్మలరామారం : చిన్నతనంలో వివాహాలు చేసుకోవడం వల్ల అనేక అనర్థాలు తలెత్తుతాయని మహిళా సాధికారిత, సఖి కేంద్రాల అధికారులు పేర్కొన్నారు. బాల్య వివాహాలపై కలిగే దుష్పరిణామాలపై బొమ్మలరామారం మండలం మాల్యాల గ్రామంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. యుక్త వయస్సు వచ్చిన తర్వాతే పెళ్లి చేసుకోవాలన్నారు. అనంతరం సోషల్ మీడియా వల్ల కలిగే నష్టాలు, వ్యక్తిత్వ వికాసం, సెల్ఫ్ డిఫెన్స్, హెల్ప్‌లైన్ నంబర్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు భార్గవి, మనీషా, పాఠశాల ప్రత్యేకాధికారి లక్ష్మి ఉన్నారు.

మహిళలకు ఆర్టీసీ బహుమతులు

భానుపురి (సూర్యాపేట) : ఆర్టీసీ బస్సుల్లో ఈనెల 30, 31వ తేదీల్లో ప్రయాణించే మహిళలకు బహుమతులు అందజేయనున్నట్లు నల్లగొండ రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. మహిళలు తమ టికెట్ వెనుకాల అడ్రస్, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్లలోని గిఫ్ట్ బాక్సుల్లో వేయాలని సూచించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయన్నారు.

● రాఖీ సందడి



చౌటుప్పల్‌లోని ట్రినిటీ స్కూల్‌లో బాలురకు రాఖీలు కడుతున్న బాలికలు



భువనగిరిలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

యూరియా కష్టాలు

పది రోజులుగా కొరత

- ఇటీవల కురిసిన వర్షాలకు ఒక్కసారిగా పెరిగిన వాడకం
- రెండో దశకూ ముందస్తుగానే నిల్వ చేసుకుంటున్న రైతులు
- హోల్‌సేల్ డీలర్లు, కంపెనీల అధికారులు రింగ్



యూరియా కోసం అడ్డగూడూరు పీఏసీఎస్ వద్ద లైన్‌లో నిల్చున్న రైతులు

సాక్షి, యాదాద్రి : రైతులను యూరియా కొరత వేధిస్తోంది. ఎరువుల డీలర్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో యూరియా దొరకడం లేదు. జిల్లాలో ఇప్పటికిప్పుడు సుమారు వెయ్యి టన్నుల డిమాండ్ ఉంది. అరకొరగా వస్తున్న యూరియా కోసం రైతులు క్యూ కడుతున్నారు. కొరత లేదని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

వరి, పత్తి సాగు ఇలా..

జిల్లాలో 2,89,325 ఎకరాల్లో వరి, 99,354 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. చాలా రోజుల తర్వాత కురిసిన వర్షాలకు రైతులంతా ఒకేసారి పంట చేలకు యూరియా పెట్టడం ప్రారంభించడంతో డిమాండ్ పెరిగి కొరత ఏర్పడింది. అంతేకాకుండా రైతులు చేను పెరగడానికి మోతాదుకు మించి యూరియా వాడుతున్నారు.

ముందు జాగ్రత్తగా ఎక్కువ కొనుగోలు

ఇటీవల వర్షాలు కురువడంతో పంటలకు మొదటి దశ యూరియా పెడుతున్నారు. పనిలోపనిగా రెండవ దశకు అవసరమైన యూరియా కూడా రైతులు ఇప్పుడే కొనుగోలు చేస్తుండడంతో అందరికీ అందడం లేదు. ప్రధానంగా రామన్నపేట, పోచంపల్లి, వలిగొండ, భువనగిరి, ఆలేరు, అడ్డగూడూరు, ఆత్మకూర్(ఎం) మండలాల్లో యూరియా దొరకడం లేదని రైతులు చెబుతున్నారు.

వర్షాలు లేవని తక్కువగా నిల్వ

ఈ ఏడాది సమయానుకూలంగా వర్షాలు కురువడం లేదు. కాలం కాదేమోనన్న భావనంతో డీలర్లు యూరియాను నిల్వ చేయలేదు. ఒకేసారి వాడకం పెరగడంతో యూరియా కొరత ఏర్పడానికి కారణమవుతోంది.

నష్టాన్ని పూడ్చుకునేందుకు కృత్రిమ కొరత!

ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు హైదరాబాద్‌కు చెందిన హోల్‌సేల్ డీలర్లు, యూరియా కంపెనీల అధికారులు రింగ్ కావడం కావడం కూడా యూరియా కొరతకు కారణంగా తెలుస్తోంది. కాంప్లెక్స్ ఎరువులు అండర్ సేల్ అమ్మకం చేశారు. జరిగిన నష్టాన్ని పూడ్చుకునేందుకు యూరియా కొరత సృష్టించినట్లు ఆరోపణలున్నాయి. అంతేకాకుండా ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

హోల్‌సేల్ డీలర్ల దందా

వారం రోజుల క్రితం ఒక రిటైల్ డీలర్ యూరియా కోసం హోల్‌సేల్ డీలర్‌ను ఆశ్రయించగా లేదన్నాడు. దీంతో రిటైల్ డీలర్ ఒక బ్రోకర్‌ను ఆశ్రయించగా హోల్‌సేల్ డీలర్ నుంచి బస్తా రూ.310 చొప్పున మిర్యాలగూడ నుంచి ఇప్పించాడు. బ్రోకర్ కమీషన్, లారీ కిరాయి, దిగుమతి మామూలు, హమాలీ చార్జి కలుపుకొని రిటైల్ డీలర్‌కు బస్తా యూరియా రూ.356 చొప్పున పడింది. సదరు డీలర్ బస్తా యూరియా ఎంఆర్‌పీ ధర రూ.266కు విక్రయించాలి. కానీ, నష్టపోలేక రూ.300 చొప్పున అమ్ముతున్నాడు. అప్పటికీ నష్టం వస్తున్నప్పటికీ షాప్ నడపటానికి తప్పని పరిస్థితిలో అమ్మకం చేస్తున్నాడు.అధికారులు హోల్‌సేల్ డీలర్లను వదిలేసి చిన్న డీలర్లు దుకాణాల్లో తనిఖీలు చేస్తారన్న భయంతో సమాచారం ఇవ్వడానికి సంకోచిస్తున్నాడు.

పది బస్తాలు అవసరం ఉంటే రెండే బస్తాలు

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యసాయ సహకార సంఘానికి బుధవారం యూరియా కోసం వచ్చిన రైతులకు నిరీక్షణ తప్పలేదు. ఎంత అవసరం ఉన్నప్పటికీ కేవలం రెండు బస్తాలు మాత్రమే ఇచ్చి పంపారు. అవి కూడా దుక్కి మందు తీసుకుంటేనే ఇస్తున్నారని రైతులు వాపోయారు. యూరియా కోసం వారం రోజులుగా తిరుగుతున్నామని, అవసరం మేరకు ప్రభుత్వం యూరియా అందుబాటులో ఉంచాలని కోరారు.

అధికంగా కొనుగోలు చేయొద్దు



జిల్లాలో యూరియా కొరత లేకుండా చూస్తున్నాం. రైతులు ముందస్తుగా నిల్వ చేసుకోవడానికి అధికంగా కొనుగోలు చేయొద్దు. జిల్లా వ్యాప్తంగా 185 మంది డీలర్లు, పీఏసీఎస్‌ల్లో యూరియాను అందుబాటులో ఉంచాం. ఈ సీజన్‌లో 6,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు 4290 మెట్రిక్ టన్నులు వచ్చింది. అందులో సొసైటీలకు 40 శాతం, డీలర్లకు 60 శాతం సరఫరా చేస్తున్నాం.

–అనురాధ, జిల్లా వ్యవసాయాధికారి

దుక్కి మందు తీసుకోవాలంటున్నారు



వరికి మొదటి విడత 9 బస్తాల యూరియా అవసరం ఉంది. కొనుగోలు చేయడానికి ఎరువుల షాప్‌కు వెళ్తే దుక్కి మందులేదా గుళికలు కొనుగోలు చేయాలని షరతు విధిస్తునఆనరు. లేదంటే యూరియా దొరకదంటున్నారు. ప్రభుత్వం సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలి.

–తిప్పతి మధు, రైతు, అడ్డగూడూరు

‘హస్తం’లో బీసీ చర్చ!

హాట్ టాపిక్‌గా ఎంపీ కోమటిరెడ్డి వ్యాఖ్యలు

- ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో రెండు సీట్లు కేటాయిస్తామని మరోసారి చెప్పిన వెంకట్‌రెడ్డి
- అవసరమైతే నల్లగొండలో బీసీని నిలబెట్టి గెలిపిస్తానని వెల్లడి
- జానారెడ్డి ఇంట్లో ఇద్దరు దరఖాస్తు చేశారని వ్యాఖ్య



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీసీల అంశంపై భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బీసీలకు రెండు అసెంబ్లీ స్థానాలు బీసీలకు కేటాయించే యోచనలో కాంగ్రెస్ పార్టీ ఉన్నట్లు రెండు నెలల కిందట పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ తరువాత ఆ అంశంపై చర్చ లేకుండాపోయింది. అయితే, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఈ అంశాన్ని మళ్లీ తెరపైకి తెచ్చారు.

సీనియర్లు త్యాగం చేయాలి

ప్రతి పార్లమెంటు స్థానం పరిధిలో బీసీలకు రెండు చొప్పున అసెంబ్లీ టికెట్లు ఇవ్వాలని రాహుల్‌కు చెప్పానని వెంకట్‌రెడ్డి ప్రకటించడం వెనుక వ్యూహాత్మక వైఖరి ఉన్నట్లుగా తెలుస్తోంది. తానే ఆ ప్రతిపాదన చేసినందున, అందుకు తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. సీనియర్లు త్యాగాలకు సిద్ధం కావాలని పేర్కొన్నారు. అంతేకాదు కాంగ్రెస్ పార్టీ తన డిక్లరేషన్‌ను అమలు చేసి తీరుతుందని స్పష్టం చేశారు. నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో దేవరకొండ(ఎస్టీ) స్థానం పోతే మిగతావి ఆరు జనరల్ స్థానాలు ఉన్నాయి. తనతో పాటు ఉత్తమ్ ఉన్నారని, మాజీ మంత్రి జానారెడ్డి కుమారులు చెరో నియోజకవర్గంలో దరఖాస్తు చేశారని, సూర్యాపేటలోనూ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి ఉన్నారని, ఎవరైరా ఇద్దరు త్యాగం చేయాలని చెప్పుకొచ్చారు. ఆయన ఏ ఉద్దేశంతో అన్నారో స్పష్టం చేయకపోయినా, ఆ వ్యాఖ్యలు మాత్రం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. నల్లగొండ నియోజకవర్గం నుంచి పోటీలో ఉంటానని ఏడాది కిందటే ప్రకటించిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. ఇప్పుడు అవసరమైతే తాను పోటీ నుంచి తప్పుకొని బీసీకి అవకాశం ఇస్తానని చెప్పడంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ రాజకీయం అంతా ఆయన చుట్టే తిరిగేలా చేశారు. బీసీలకు సర్దుబాటు కానప్పుడు త్యాగం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, రేపు ప్రభుత్వం వస్తే ఎమ్మెల్సీ తీసుకుంటానని, లేదంటే ఎంపీగా పోతానని పేర్కొన్నారు.

వ్యూహంలో భాగంగానే దరఖాస్తు చేశారా..

మొదటి నుంచి నల్లగొండ టికెట్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికే అన్నది సుస్పష్టం. ఆయన్ని కాదని మరొకరికి ఇచ్చే సాహసాన్ని కాంగ్రెస్ చేసే అవకాశం కూడా లేదని పార్టీ వర్గాల భావన. అలాంటి పరిస్థితుల్లో ఆయన బీసీ నినాదాన్ని తెరపైకి ఎందుకు తెచ్చారని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రస్తుతం నల్లగొండలో కాంగ్రెస్ టికెట్ కోసం ఆయనతో పాటు మరో ఆరుగురు దరఖాస్తు చేశారు. అందులో నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి, తిప్పర్తి జెడ్పీటీసీ తండు సైదులు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ కూడా ఉన్నారు. అయితే, ఎంపీ వెంకట్‌రెడ్డి సూచన మేరకే బొడ్డుపల్లి లక్ష్మి దరఖాస్తు చేశారనే చర్చ జరుగుతోంది.

త్వరలోనే స్పష్టత

కాంగ్రెస్ తరఫున పోటీలో ఉండే అభ్యర్థులకు టికెట్ల కేటాయింపును మరికొద్ది రోజుల్లో ప్రకటించేందుకు టీపీసీసీ, ఎన్నికల కమిటీ వేగంగా కసరత్తు చేస్తోంది. ఎంపీ వెంకట్‌రెడ్డి చేసిన ఈ సూచనలను అధిష్టానం పరిగణనలోకి తీసుకుంటుందా? లేదా అన్నది త్వరలో తేలనుంది. నిజంగా అదే జరిగితే బీసీలంతా కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గుచూపే అవకాశం లేకపోలేదు. కాంగ్రెస్ పార్టీ ప్రతి ఎంపీ స్థానంలో బీసీలకు రెండు టికెట్లు ఇస్తే అధికార పార్టీపైనా ఈ ఒత్తిడి పెరిగే అవకాశం ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కోరారు. బుధవారం భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌కు చెందిన 100 మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లోనూ కార్యకర్తలంతా సమష్టిగా పనిచేసి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, కోట మల్లారెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు పాటి సుధాకర్‌రెడ్డి, సీత వెంకటేశం, కౌన్సిలర్ కృష్ణ, దారెడ్డి మల్లారెడ్డి పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కమలం శ్రేణులకు దిశానిర్దేశం

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షిస్తున్న తరుణ్‌చుగ్



నకిరేకల్ నియోజకవర్గ నాయకులతో సమీక్ష నిర్వహిస్తున్న తరుణ్‌చుగ్

- పార్టీ స్థితిగతులను తెలుసుకుంటున్న బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి
- నేడూ కొనసాగనున్న సమావేశాలు

నల్లగొండ టూటౌన్ : బీజేపీ శ్రేణులకు ఆ పార్టీ నాయకత్వం దిశానిర్దేశం చేస్తోంది. ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల వారీగా పార్టీ మండల అధ్యక్షులు, నియోజకవర్గ బాధ్యులు, వివిధ హోదాలో ఉన్న ముఖ్యులతో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ సమీక్షలు నిర్వహిస్తున్నారు. బుధవారం మొదటిరోజు నల్లగొండలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నకిరేకల్, నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పార్టీ పరిస్థితి, బూత్ కమిటీల నియామకం, సంస్థగతంగా బలోపేతంపై నాయకులతో సమీక్షించారు. మేరా మాటి – మేరా దేశ్ కార్యక్రమ యోజన, ఓటర్ లిస్ట్ పరిశీలన, బూత్ కమిటీలు పూర్తికాని చోట కొత్త కమిటీల నియామకం, ఎమ్మెల్యే ప్రభాస్ యోజన అసెంబ్లీ వారీగా ఎలా జరిగిందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ ఎస్టీ నియోజకవర్గాల్లో ఇటీవల నిర్వహించిన సమ్మేళనంపై సమీక్షించారు. సెప్టెంబర్ 7న నిర్వహించనున్న చలో హైదరాబాద్, త్వరలో జరిగే వాహన యాత్ర, సెప్టెంబర్ 17న నిర్వహించే కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల్లో గెలుపు కోసం సూచనలు చేశారు. నేడు కూడా సమీక్షలు కొనసాగనున్నాయి. ఒకేరోజు పది నియోజకవర్గాల సమీక్షలను పూర్తి చేయనున్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన, శ్రీస్వామి వారికి బాలభోగం, మూలవర్యులకు నిజాభిషేకం చేసి అలంకరించారు. అలాగే శ్రీస్వామివారికి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన గావించి భక్తులకు శ్రీస్వామి వారి దర్శనం భాగ్యం కల్పించారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, బ్రహ్మోత్సవం, నిత్యకల్యాణం, తిరువీధి జోడు సేవ, రాత్రి పవళింపు సేవ నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఉపాధ్యాయులకు ఊరట

- బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన హైకోర్టు
- స్పౌజ్ కింద మాత్రమే 10 పాయింట్లు ఇవ్వాలని తీర్పు



భువనగిరి : ఉపాధ్యాయులకు తీపి కబురు చెప్పింది రాష్ట్ర హైకోర్టు. బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిది. దీంతో సంవత్సరాల తరబడి ఒకే చోట పని చేస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ దంపతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. కానీ, ఉపాధ్యాయ సంఘాల నాయకులకు 10 పాయింట్లు ఇవ్వడాన్ని తప్పుబడుతూ అదే సమయంలో కొందరు టీచర్లు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో బదిలీలు, పదోన్నతులపై న్యాయస్థానం స్టే విధించడంతో ఏడు నెలలుగా ఉపాధ్యాయులకు ఎదురు చూపులు తప్పలేదు. బుధవారం కోర్టు ఇచ్చిన తీర్పుతో ఊరట లభించింది. ఉపాధ్యాయ సంఘాల నాయకులకు 10 పాయింట్లు ఇవ్వడం కుదరదని, ఉపాధ్యాయ దంపతులకు మాత్రమే 10 పాయింట్లు ఇస్తున్నట్లు తీర్పులో పేర్కొంది. జిల్లాలో 11 సంఘాలకు చెందిన సుమారు 22 మంది నాయకులు జాబితాలో ఉన్నారు.

2,690 మంది ఉపాధ్యాయులు

జిల్లాలో ప్రస్తుతం 2,690 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. బదిలీలు, పదోన్నతులకు 1,803 మంది దరఖాస్తు చేసుకున్నారు. కోర్టు తీర్పుతో ఊరట కలిగిన ఉపాధ్యాయులకు మరో సందిగ్ధం నెలకొంది. మరో 40 రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉన్నందున బదిలీలు, పదోన్నతులు జరుగుతాయ లేదా అనే సందేహం నెలకొంది.

వెంటనే ప్రక్రియ ప్రారంభించాలి



ఉపాధ్యాయ సంఘాల నాయకులకు ఇచ్చే పాయింట్ల విషయంలో కోర్టు తీర్పును గౌరవిస్తున్నాం. చాలా ఏళ్లుగా బదిలీలు జరగక, ఖాళీల పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు నష్టం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేయకుండా వెంటనే ప్రక్రియ ప్రారంభించాలి.

–మెతుకు సైదులు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

తప్పులు లేని జాబితా తయారు చేద్దాం

- రాజకీయ పార్టీలు సహకరించాలి
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి, యాదాద్రి : తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి కోరారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటరు జాబితా తయారీపై సమీక్షించారు. సెప్టెంబర్ 19వరకు ఓటరు ముసాయిదా జాబితా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అక్టోబర్ 1నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో నమోదు చేయనున్నట్లు చెప్పారు. పేర్లు, అడ్రస్ మార్పు, సవరణల కోసం కూడా ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.సెప్టెంబర్ 2,3తేదీల్లో ప్రత్యేక కేంద్రాల ద్వారా ఓటరు నమోదు ఉంటుందని, వెల్లడించారు. మార్పులు, చేర్పులు, తొలగింపులకు ఫారమ్ 6,7,8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

3,626 దరఖాస్తులు ఆమోదం

ఓటరు నమోదు, చేర్పులు, మార్పుల కోసం ఈనెల 16నుంచి 29వ తేదీ వరకు 16,476 దరఖాస్తులు రాగా 3,626 ఆమోదించామని, 15 దరఖాస్తులు తిరస్కరించినట్లు చెప్పారు. మిగతా 12,835 దరఖాస్తులు విచారణలో ఉన్నాయన్నారు. ఎపిక్ కార్డులకు సంబంధించి మొదటి దశలో 14,750, రెండవ దశలో 13,386 ఓటరు కార్డులను స్పీడ్ పోస్ట్ ద్వారా ఓటర్లకు పంపిణీ చేసినట్లు తెలిపారు. మూడవ దశలో 21,418 కార్డులు ప్రింటింగ్ దశలో ఉన్నాయని, వీటిని కూడా స్పీడ్ పోస్ట్ ద్వారా ఓటర్లకు పంపనున్నట్లు వివరించారు. ఎవరైనా ఎపిక్ కార్డు పోగొట్టుకున్నట్లయితే డుప్లికేట్ కార్డు కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి బుధవారం సమావేశం ఏర్పాటు చేసి వివరాలు అందజేస్తామన్నారు. ఓటరు నమోదుపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎ.భాస్కర్‌రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు బట్టు రామచంద్రయ్య, గడ్డం వెంకటేష్, కిరణ్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారులు

- జిల్లా స్థాయి ఆఫీసర్లకు బాధ్యతలు

సాక్షి యాదాద్రి : సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం నోడల్ ఆఫీసర్లను నియమించారు. జిల్లా స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం కలెక్టర్ వినాయక్ కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

- ఈవీఎంల మేనేజ్‌మెంట్ అదనపు కలెక్టర్(రెవెన్యూ) భాస్కర్‌రావు
- మెటీరియల్ మేనేజ్‌మెంట్ చేనేత, జౌళి శాఖ ఏడీఏ విద్యాసాగర్
- మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, ట్రైనింగ్ విభాగానికి డీఈఓ నారాయణరెడ్డి
- ట్రాన్స్‌పోర్ట్ మరియు కంప్లైంట్స్ రిడ్రెసల్, ఓటరు హెల్ప్‌లైన్‌కు ముఖ్య ప్రణాళిక అధికారి భూక్యా మాన్యానాయక్,ఆర్టీఓ సుదర్శన్‌రెడ్డి
- కంప్యూటరైజేషన్ సైబర్ సెక్యూరిటీ, ఐటీకి జిల్లా ఇన్‌ఫర్మేటిక్ ఆఫీసర్ రాధాకృష్ణ
- స్వీప్ నోడల్ అధికారిగా భువనగిరి మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి
- లా అండ్ ఆర్డర్ సెక్యూరిటీ ప్లాన్ విభాగానికి ఏసీపీ వెంకటరెడ్డి
- ఏసీసీకి ప్రణాళిక ఆఫసీర్ సునంద
- ఖర్చుల వివరాలు చూడటానికి జిల్లా సహకార అధికారి శ్రీనివాస్‌రావు
- బ్యాలెట్ పేపర్, పోస్టల్ బ్యాలెట్, ఎలక్ట్రోరల్ విభాగానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శేఖర్‌రెడ్డి
- ఎంసీఎంసీ విభాగానికి పౌర సంబంధాల అధికారి వెంకటేశ్వర్‌రావు
- పరిశీలకుల విభాగానికి డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి
- దివ్యాంగుల కోసం డీఐఈఓ రమణి
- పోలింగ్ అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలించడం, లెక్కింపు కేంద్రాలకు యువజన అధికారి కె.ధనంజనేయులు
- మెడికల్ డీఎంహెచ్‌ఓ మల్లికార్జునరావు
- ఫైర్ సేఫ్టీకి అగ్నిమాపక శాఖ అధికారి జయకృష్ణ



పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలి

ఎన్నికల నిర్వహణపై పూర్తిసాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్ కష్ణారెడ్డి నోడల్ అధికారులకు సూచించారు. ఇక నుంచి వారంలో ఒక రోజు ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్ష ఉంటుందన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన పెద్దింటి లింగమల్లు (38) ఈనెల 20వ తేదీన తన స్నేహితుడు కట్ట విజయ్‌తో కలిసి సూర్యాపేటకు బైక్‌పై వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో నెమ్మికల్ శివారు గట్టికల్ స్టేజీ వద్ద వీరి బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనకాల కూర్చున్న లింగమల్లు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. పదిరోజుల పాటు చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి బుధవారం మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

నాగారం : సూర్యాపేట–జనగాం రహదారిపై బుధవారం ఫణిగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. తిరుమలగిరి మండలం మాలిపురం గ్రామానికి చెందిన సున్నం భిక్షం బైక్‌పై నాగారం నుంచి తిరుమలగిరి వైపు వెళుతున్నాడు. ఈ క్రమంలో ఫణిగిరి స్టేజి సమీపంలోని రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన కిలోమీటర్ రాయిని వేగంగా ఢీకొని కిందపడటంతో తీవ్రగాయాలైనాయి. స్థానికులు అతడిని 108 ద్వారా సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని డివైడర్ ధ్వంసం



మోత్కూరులో ధ్వంసమైన డివైడర్

మోత్కూరు : మోత్కూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న డివైడర్‌ను బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో పూర్తిగా ధ్వంసమయింది. డివైడర్‌లోని రాళ్లు చెల్లాచెదురయ్యాయి. దీంతో డివైడర్ నిర్మాణంలో నాణ్యత లోపించిందని పలువురు ఆరోపిస్తున్నారు.

జానయ్యపై చర్యలు తీసుకోవాలి

పంజగుట్ట: సూర్యాపేట జిల్లా మార్కెట్ సొసైటీ చైర్మన్ వట్టె జానయ్య భూకబ్జాల నుంచి తమకు విముక్తి కల్పించాలని జానయ్య బాధితుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఇతని భూకబ్జాలపై గతంలోనే మానవహక్కుల సంఘానికి, కలెక్టర్‌కు, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని బుధవారం మరోమారు మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు వల్లెం శంకర ప్రసాద్, పాలవరపు వేణు, శ్రీనివాస్ మాట్లాడారు. జానయ్య సూర్యాపేటలో మరో నయీంగా అవతారం ఎత్తాడన్నారు. అధికారపార్టీలో ఉండడం, మంత్రి చూసీ చూడనట్లు వ్యవహరించడంతోనే పోలీసులు ఇతనిపై చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చెట్లను నరికిన వారిపై కేసు

రామన్నపేట: మండలంలోని ఇంద్రపాలనగరం– శోభనాద్రిపురం గ్రామాల మధ్య ఆసిఫ్‌నహర్ కాల్వ వెంట బుధవారం చెట్లను నరికిన వారిపై ఫారెస్ట్ అధికారులు కేసు నమోదు చేశారు. వివరాలివున్నాయి.. ఆఫీస్‌నగర్ కాల్వ వెంట గల చెట్లను కొందరు వ్యక్తులు నరికివేసి ట్రాక్టర్‌లో తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు దాడి చేశారు. చెట్ల నరికివేతకు సంబంధించి అనుమతులు లేకపోవటాన్ని గుర్తించిన ఫారెస్ట్ అధికారి శ్రీనువాసులు పంచనామా నిర్వహించారు. చెట్లను నరకటానికి ఉపయోగించిన క్రేన్‌తో పాటు లోడ్ చేసిన ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని రామన్నపేట పోలీసులకు అప్పగించాడు.

బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదు

- మంత్రి జగదీష్‌రెడ్డికి బీఎస్పీ నాయకుల హెచ్చరిక
- వట్టె జానయ్యపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్
- ఒక్క రోజులోనే 74 కేసులు నమోదు.. దుర్మార్గమైన చర్యని మండిపాటు
- బీఎస్పీ ఆధ్వర్యంలో సూర్యాపేటలో రాస్తారోకో



సూర్యాపేట జిల్లా కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న బీఎస్పీ నాయకులు

సూర్యాపేట రూరల్ : వచ్చే ఎన్నికల్లో మంత్రి జగదీష్‌రెడ్డి బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని బీఎస్పీ నాయకులు హెచ్చరించారు. డీసీఎంఎస్ చైర్మన్ వట్టెజానయ్య యాదవ్‌పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనకారులను అరెస్ట్ చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ జానయ్య యాదవ్‌ని ఇంతకాలం తన వెంటబెట్టుకొని ఉన్న మంత్రి జగదీష్‌రెడ్డి ఒక్కరోజులోనే 74కేసులు ఎలా పెట్టించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల రాజకీయ ఎదుగుదలను చూసి ఆయనపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. బహుజన వాదాన్ని మంత్రి అణగదొక్కాలని చూస్తున్నారని మండిపడ్డారు. ముందస్తుగానే జిల్లా కేంద్రంతో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. కార్యక్రమంలో నాయకులు బుడిగే మల్లేష్, హరిప్రియ, జ్యోతి, రాజు, రాజేశ్వరి, సైదులు, పద్మ, సత్యనారాయణ, చారి, సతీష్ పాల్గొన్నారు.



బీఎస్పీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు



నల్లగొండలో మంత్రి జగదీష్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేస్తున్న యాదవ సంఘం నాయకులు

జానయ్యపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

నల్లగొండ టౌన్ : ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యపై మంత్రి జగదీష్‌రెడ్డి పెట్టించిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి అల్లివేణుయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం జానయ్యపై అక్రమ కేసులు పెట్టించడాన్ని నిరసిస్తూ స్థానిక బస్టాండ్ వద్ద మంత్రి జగదీష్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వట్టె జానయ్య రాజకీయ ఎదుగుదలను జీర్ణించుకోలేక మంత్రి కుట్ర చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా బీసీలు కళ్లుతెరవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాములుయాదవ్, చికల శ్రీనివాస్‌యాదవ్, అల్లిసుభాష్ యాదవ్, గుండెబోయిన వెంకన్నయాదవ్, లోహితయాదవ్, రాజుయాదవ్, రాందేవ్‌యాదవ్, గుండెబోయిన మల్లయ్యయాదవ్, రవియాదవ్, కడారి కోటి, మేకల యాదయ్య, పృథ్వి, శివ, అంజనేయులు పాల్గొన్నారు.

భీమనపల్లిలో తాళం వేసిన ఇంట్లో చోరీ

భూదాన్‌పోచంపల్లి : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం భూదాన్‌పోచంపల్లి మండలంలోని భీమనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమనపల్లి గ్రామానికి చెందిన ముంత లక్ష్మమ్మకు వివాహితులైన కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భర్త ఇటీవల చనిపోయాడు. కుమారుడు బతుదెరువు కోసం ముంబాయికి వెళ్లి అక్కడే ఉంటున్నాడు. లక్ష్మమ్మ ఇంటి వద్ద ఒంటరిగా ఉంటుంది. లక్ష్మమ్మ ఈ నెల 22న ఇంటికి తాళం వేసి చౌటుప్పల్ మండలం తుఫ్రాన్‌పేటలో ఉంటున్న కుమార్తె ఇంటికి బోనాల పండుగకు వెళ్లింది. తిరిగి ఈ నెల 29న సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు విరిగి ఉన్నాయి. అనుమానం వచ్చి లోనికి వెళ్లిచూడగా ట్రంక్ పెట్టెలో దాచిన కిలోన్నర వెండి కడియాలు, పట్టగొలుసులు, నాణే కడియాలు, అర తులం బంగారం, రూ.4వేల నగదు దుండగులు ఎత్తుకెళ్లారు. వెంటనే బాధితురాలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చౌటుప్పల్ రూరల్‌సీఐ మహేశ్, ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితురాలు ముంత లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

పోలీసులపై దాడి చేసిన వ్యక్తులపై కేసు

నాగారం : విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడి చేసిన పలువురిపై బుధవారం నాగారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫణిగిరి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగారం మండల పరిధిలోని ఈటూరు గ్రామానికి చెందిన నడిపల్లి హరీష్ మృతిచెందాడు. పోలీసులు ఫణిగిరి స్టేజి వద్ద చలాన్‌లు రాస్తుండటంతోనే హరీష్ భయపడి బైక్‌ను వెనుకకు మళ్లించే ప్రయత్నంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడని, హరీష్ మృతికి పోలీసులే కారణమంటూ మంగళవారం రాత్రి కొంత మంది వ్యక్తులు పోలీసులపై చెప్పులతో దాడి చేశారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వీడియో ఆధారంగా పోలీసులపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి.ముత్తయ్య తెలిపారు.

మొక్కను ఎందుకు తొలగించావని అడిగినందుకు దాడి

- దెబ్బలకు తాళలేక వృద్ధురాలు మృతి

మిర్యాలగూడ టౌన్ : మొక్కను ఎందుకు తొలగించావని అడిగిన వృద్ధురాలిపై ఓ మహిళ దాడి చేసింది. దెబ్బలకు తాళలేక ఆ వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన మిర్యాలగూడ మండలం శ్రీనివాసనగర్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనివాసనగర్ గ్రామానికి చెందిన అక్కమ్మ (85) తన కుమార్తె మంగమ్మతో కలిసి గుడిసెలో ఉంటోంది. మంగమ్మ మంగళవారం కూలి పనులకు వెళ్లగా అక్కమ్మ గుడిసెలోనే ఉంది. గుడిసె వెనుక భాగంలో అక్కమ్మ పెంచుకుంటున్న పూల మొక్కను పక్కనే అద్దె ఇంట్లో ఉంటున్న శిలువమ్మ తొలగించింది. గమనించిన అక్కమ్మ మొక్కను ఎందుకు తొలగించావని శిలువమ్మతో వాగ్వాదానికి దిగింది. సాయంత్రం అక్కమ్మ తన కుమార్తెతో కలసి గుడిసెలో ఉన్న సమయంలో శిలువమ్మ వచ్చి దాడికి దిగింది. మంచంపై పడుకున్న అక్కమ్మపై దాడి చేసి కిందపడేసి వెళ్లిపోయింది. గాయపడిన ఆమెను ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించాడు. శిలువమ్మ దెబ్బలకు తాళలేకనే తన తల్లి అక్కమ్మ మృతిచెందిందని మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం నాయకులు కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండవ రోజైన బుధవారం కూడా కొనసాగాయి. సమగ్ర శిక్షా ఉద్యోగులందరికీ కనీస వేతన స్కేలు, ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ. 10 లక్షలు , ఆరోగ్య బీమా రూ. 5 లక్షలు అందించాలన్నారు. విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు రాంబాబు, కోశాధికారి లక్ష్మీనారాయణ, సయ్యద్, నాగరాజు, మదనాచారి, శీను, రవి, కోటేశ్వరావు, అంజన్, సరస్వతి, సునీత, ఉమా పాల్గొన్నారు.

రుణాల మంజూరులో ఇబ్బందులు పెట్టొద్దు

- బ్యాంకర్లు రుణ లక్ష్యం పూర్తి చేయాలి
- సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో బ్యాంకర్లు రుణాల మంజూరులో లబ్ధిదారులకు ఇబ్బందులు పెట్టొద్దని సూర్యాపేట కలెక్టర్ ఎస్. వెంకట్రావు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ కోఆర్డినేషన్ కమిటీ(డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవల్ రివ్యూకమిటీ (డీఎల్‌ఆర్‌సీ) మొదటి త్రైమాసిక సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. బ్యాంకర్లు రుణ లక్ష్యం పూర్తి చేయాలన్నారు. పంట రుణాలు విరివిగా ఇవ్వాలని, ఉద్యాన వన రైతులకు బ్యాంకర్లు ఎక్కువగా రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ ఉద్యాన శాఖ ద్వారా లబ్ధిదారులకు చెల్లిస్తామన్నారు. యువత ఉన్నత చదువుకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.10 లక్షల లోపు విద్యా రుణాలు అందించాలని, రుణాల మంజూరు కోసం ప్రజావాణిలో అందించిన దరఖాస్తులపై సత్వరమే బ్యాంకర్లు స్పందించాలన్నారు. ముద్ర పథకం కింద అందించే రుణాలు వికలాంగులకు కూడా అవకాశం కల్పించి ఆర్థిక భరోసాకు చేయూత అందించాలన్నారు. జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికం రుణ లక్ష్యంలో కేవలం 44.85 శాతం మాత్రమే అందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం బాపూజీ, ఆర్‌బీఐ ఏజీఎం తన్యా సంగ్మా, నాబార్డ్ ఏజీఎం సత్యనారాయణ, ఎస్‌బీఐ ఏజీఎం జ్యోతి, డీసీబీ సీఈఓ మదన్‌మోహన్, ఏపీజీవీబీ ఏజీబీ శ్రీనివాసులు, విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావు

రేపు నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

సూర్యాపేటటౌన్ : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి(జాక్టో) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేయనున్నట్లు టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాస్‌నాయుడు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాక్టో సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా నిరసన కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 1న జిల్లా కలెక్టర్‌లకు వినతి పత్రాలు సమర్పించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో టీపీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మట్టపల్లి రాధాకృష్ణారావు, రాష్ట్ర కార్యదర్శి ఎ.రమేష్, కె.నాగయ్య, బచ్చుపల్లి శంకర్‌రావు, నిమ్మల శ్రీనివాస్, ఉపేందర్, కేశయ్య పాల్గొన్నారు.

వట్టె జానయ్యపై అక్రమ కేసులను ఖండిస్తున్నాం

- బీఎస్పీ అధికార ప్రతినిధులు జక్కని సంజయ్ కుమార్, అరుణ క్వీన్



మాట్లాడుతున్న బీఎస్పీ అధికార ప్రతినిధులు జక్కని సంజయ్ కుమార్, అరుణ క్వీన్

నాంపల్లి : ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ (డీసీఎంఎస్), బీసీ నాయకుడు వట్టె జానయ్య యాదవ్‌పై పోలీసులు అక్రమ కేసులను బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఎస్పీ అధికార ప్రతినిధులు జక్కని సంజయ్ కుమార్, అరుణ క్వీన్ అన్నారు. హైదరాబాదులోని బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ప్రోద్బలం, ఒత్తిడితోనే వట్టె జానయ్య యాదవ్‌పై పోలీసులు అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ఓడిపోతాడనే భయంతో వట్టే జానయ్య యాదవ్‌పై మంత్రి జగదీష్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. అన్ని పోలీసుస్టేషన్లలో ఏకకాలంలో కేసులు బనాయించి పీడీ యాక్టుపై జైలుకు పంపించాలనే కుట్రతోనే మంత్రి కొంత మందిని ఉసిగొల్పుతూ నిరాధారమైన ఆరోపణలు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ నాయకుని పట్ల సూర్యాపేటలో పోలీసులు వ్యవహరించిన తీరు సరిగా లేదన్నారు. జానయ్యకు ఆయన కుటుంబ సభ్యులకు మంత్రి జగదీష్ రెడ్డి నుంచి ప్రాణహాని ఉందని, తక్షణమే ఆయనకు పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీలో జెండాలు మోసే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి బీఎస్పీలో చేరాలని కోరారు. ఆధిపత్య పార్టీలో పనిచేసే బహుజన నాయకులకు ఇదే గతి పడుతుందని అన్నారు. బహుజన రాజ్యం సాధనతోనే బీసీలకు ఆత్మ గౌరవం దక్కుతుందన్నారు. పోలీసులు హుందాగా వ్యవహరించాలని, ప్రభుత్వాలు మారుతాయనే విషయాన్ని పోలీసు అధికారులు గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఎస్పీ నాయకుల అక్రమ అరెస్టులపై తీవ్రంగా మండిపడ్డారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి సెరోల్ల ఎల్లయ్య పాల్గొన్నారు.

జానయ్యకు అండగా ఉంటాం

- యాదవ సంఘాల ప్రతినిధులు

పంజగుట్ట: డీసీఎంస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్‌కు అండగా ఉంటామని ఓయూ జేఏసీ ప్రకటించింది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఓయూ జేఏసీ, వివిధ యాదవ సంఘాల ప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ గొర్రెలు, మేకల ఫెడరేషన్ మాజీ చైర్మన్ రాజయ్య, నోముల శేషు యాదవ్, పాల్వాయి నగేష్, సిద్ధి రమేష్ మాట్లాడారు. మంత్రి జగదీష్‌రెడ్డిని గెలిపించడంలో వట్టే జానయ్య రెండు సార్లు చేసిన కృషి ఎంతో ఉందన్నారు. జానయ్య అంచెలంచెలుగా ఎదుగుతూ రాజకీయంగా బడుగు, బలహీన వర్గాలకు సేవచేసేందుకు ఎమ్మెల్యే టిక్కెట్లు అడుగుదాము అని అనుకునేలోపే, అతనిపై 70కి పైగా కేసులు పెట్టించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. సమాజం మొత్తం జానయ్య వెంటే ఉంటుందని, ఆయననను రక్షించుకుంటామన్నారు. జానయ్యపై ఇంకా వేధింపులు ఆపకపోతే మంత్రి జగదీష్‌రెడ్డిని రాజకీయంగా భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. ఆయన నిజంగా తప్పుచేసి ఉంటే ఇన్ని సంవత్సరాలు మంత్రి వెంటే ఎందుకు ఉంచుకున్నాడని, డీసీఎమ్ఎస్ చైర్మన్ పదవి ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. 2009 ఎన్నికలకు ముందు జగదీష్‌రెడ్డి ఒక సాధారణ వ్యక్తి అని, ఇప్పుడు వేల కోట్లు ఎలా సంపాదించాడని ప్రశ్నించారు. యాదవ మంత్రి తలసాని ఈ విషయమై స్పందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శ్రీకాంత్, సైదులు, గంగుల మధు, దాసరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బైక్.. యువకుడు మృతి



నవీన్(ఫైల్)

కేతేపల్లి: హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన కారంశెట్టి నవీన్(25) స్థానికంగా సెల్‌ఫోన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు యమహా బైక్‌పై ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం వద్ద గల పెట్రోల్ బంక్ సమీపంలోకి చేరుకోగానే రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని బైక్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవీన్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కేతేపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

బైక్, కారు ఢీ..



అలీసైదా (ఫైల్)

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల కేంద్రంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నేరేడుచర్ల మున్సిపాలిటీలోని నేతాజీనగర్‌కు చెందిన షేక్ అలీ సైదా(65) పని నిమిత్తం బైక్‌పై మండల కేంద్రానికి వచ్చాడు. అనంతరం తిగిరి ఇంటికి వెళ్తుండగా వ్యవసాయ మార్కెట్ వద్ద హుజూర్‌నగర్ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న కారు ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అలీ సైదాకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు మౌలానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ ఢీకొని..



మహేష్ (ఫైల్)

నాగారం : నాగారం మండలం డి.కొత్తపల్లి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మోతె మండలం నామవరం గ్రామానికి చెందిన అరిగె మహేష్(28) కొంతకాలంగా నాగారం మండలం వర్ధమానుకోటలో తన చిన్నమ్మ గుండు శైలజ దగ్గర నివాసం ఉంటూ, నాగారంలో తైవాన్ పంపుల రిపేరు షాపును పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం తైవాన్ పంపులు తేవడానికి బైక్‌పై సూర్యాపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా డి.కొత్తపల్లి స్టేజి ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు లారీని శాలిగౌరారం మండలం పెర్కాకొండారం వద్ద పట్టుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.ముత్తయ్య తెలిపారు.

బైక్ పైనుంచి కిందపడి..

కనగల్ : బైక్ పైనుంచి కిందపడి ఓ వృద్ధుడు మృతిచెందాడు. మునుగోడు మండల పరిధిలోని దుబ్బ కాల్వకు చెందిన దండు సైదులు(63) వాగుల్లో చేతి బోర్లు వేస్తూ ఉపాధి పొందుతున్నాడు. కనగల్ మండల పరిధిలోని దోరెపల్లి ఉపసర్పంచ్ దాసరి వెంకన్నకు చెందిన చేతి బోరుమోటార్ ఇరుక్కుపోయింది. దానికి మరమ్మతు చేసేందుకు మరికొందరితో పాటు సైదులు వచ్చాడు. అనంతరం వెంకన్నపై కూర్చొని సైదులు వస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నర్రా అంతిరెడ్డి తెలిపారు.

జూదరుల అరెస్టు

భువనగిరి : పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. భువనగిరి మండలం/ని వడపర్తి గ్రామ శివారులోని మల్లన్న దేవాలయం వద్ద పేకాట ఆడుతున్న సమాచారం మేరకు బుధవారం పోలీసులు దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న గ్రామానికి చెందిన మంత్రి రమేష్, జమ్మని ఇస్తారి, మేడబోయిన నరేష్, కడమంచి కరుణాకర్, హన్మాపురం గ్రామానికి చెందిన నాయుడు దుర్గాప్రసాద్, మన్నెవారిపంపు గ్రామానికి చెందిన కొండూరు వెంకటేశం, ఎల్లంల రామకృష్ణారెడ్డిలను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 18,790 నగదు, 7 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

ద్రవరూప ఎరువులతో మెరుగైన దిగుబడులు

- 8శాతం అధికంగా చేతికొస్తున్న పంట
- సాగు ఖర్చులూ తగ్గుతాయంటున్న అధికారులు

పాడి పంట

పెద్దవూర: వ్యవసాయ రంగంలో కూడా విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయి. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రైతులకు ఆర్థిక ఇబ్బందులను తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఎరువుల ఖర్చులను తగ్గించే ప్రయత్నం చేస్తుంది. అందులో భాగంగా ద్రవరూప యూరియా, డీఏపీలను తయారు చేయించింది. దీంతో భూమిలో సారం కోల్పోయి క్రమేణ పంట దిగుబడులు తగ్గుతున్నాయి. ఇప్పుడు అవే యూరియా, డీఏపీ ఎరువులను ద్రవరూపంలో తీసుకొచ్చాయి. రెండేళ్ల క్రితమే నానో యూరియా మార్కెట్లోకి రాగా ప్రస్తుతం ద్రవ రూపంలో ఉండే డీఏపీ సైతం అందుబాటులోకి వచ్చింది. ఘనరూపంలో ఉండే 50 కిలోల డీఏపీ బస్తా రూ.1350లు, యూరియా బస్తా రూ.266లు ధర మార్కెట్‌లో ఉంది. కాగా ఇఫ్కో కంపెనీ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టిన నానో డీఏపీ అరలీటరుకు రూ.600లు, యూరియా అరలీటర్‌కు రూ.240 ధరతో మార్కెట్‌లో అందుబాటులో ఉంది. ద్రవరూప యూరియాపై రూ.26(266–240), డీఏపీపై రూ.750(1350–600) వరకు రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.



ప్రయోజనాలు ఇలా..

ద్రవరూప ఎరువులతో పంటకు ప్రయోజనం సుమారు 90శాతం ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. అరలీటరు నానో డీఏపీ, యూరియా డబ్బాలు 50 కిలోల బస్తాతో సమానం. ఎకరానికి అరలీటరు నానో డీఏపీ సరిపోతుంది. వరి నాటు వేసేటప్పుడు ఘన రూప డీఏపీ ఎంత విస్తీర్ణంలో వినియోగిస్తామో, అర లీటర్ ద్రవరూప డీఏపీ పొలంలో పిచికారీ చేస్తే సరిపోతుంది. ద్రవరూపంలో పిచికారీ చేయడం వలన అదనంగా పోషకాలు సైతం ఉండటంతో మొక్కలు నత్రజని అవసరాన్ని సమర్థవంతంగా తీరుస్తుంది. దీంతో ఆకులలో కిరణజన్య సంయోగక్రియ పెరుగుతుంది. మొక్క వేర్లలో కణజాలం వృద్ధిచెంది, పంట ఉత్పత్తిలో పోషక విలువలు పెంచుతుంది. డీఏపీ, యూరియాల బస్తాలకంటే ద్రవరూప ఎరువుల్లో పోషకాలు అధికంగా ఉంటాయి. ఘనరూపంలో ఉండే ఎరువుల వినియోగంతో చాలా వరకు మొక్కకు అందకుండా వృథా అవుతుంది. ద్రవరూప ఎరువులు నేరుగా మొక్కపై పిచికారీ చేయడంతో వృథా ఉండదు.

రైతు సదస్సులు ఏర్పాటు చేయాలి



ద్రవరూపంలోని యూరియా, డీఏపీ వాడకంపై అధికారులు గ్రామాలలో రైతు సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించాలి. ఫర్టిలైజర్ దుకాణాల్లో ద్రవరూప ఎరువులను అందుబాటులో ఉంచాలి. ఘన, ద్రవ రూప ఎరువుల వాడకంలో గల తేడాలను, లాభాలను రైతులకు వివరించాలి.

–కత్తి ప్రభాకర్‌రెడ్డి, రైతు, బట్టుగూడెం

పంట దిగుబడి పెరుగుతుంది



ద్రవరూప యూరియా, డీఏపీల ఉపయోగంపై రైతులకు ఎలాంటి అనుమానం అవసరం లేదు. గుళికల ఎరువు కంటే నానో ఎరువులు చాలా మేలైనవి. వరి నాటుకు ముందుగా ఒకసారి మాత్రమే నానో డీఏపీని పొలంలో పిచికారీ చేయాలి. అలాగే నానో యూరియాను లీటర్ నీటికి 2మి.లీ. లేదా 4మి.లీ. చొప్పున కలిపి మొదటగా పంట పెరుగుదల దశలో తర్వాత నెలలోపు పూత దశలో రెండోసారి పిచికారీ చేయాలి. దీంతో రైతులకు సుమారు 8 శాతం పంట దిగుబడి పెరుగుతుంది.

– కె.సందీప్, మండల వ్యవసాయ అధికారి, పెద్దవూర మండలం